# ప్రభాత సూర్యుడు

తెలుగు దినపత్రిక

RANGAREDDY, EDITION : 01, VOLUME : 63, EDITOR:CHERUKU UPENDAR, DATE : WEDNESDAY 28 JUNE 2023 PAGES:4, RATE: Rs.5/-

రంగారెడ్డి సంపుటి : 01 సంచిక : 63, ఎడిటర్ : చెరుకు ఉపేందర్ తేదీ : బుధవారం 28 జూన్ 2023 పేజీలు : 4 వెల : 5/-


### బీఆర్ఎస్‌పై
## స్వరం మార్చిన ప్రధాని మోదీ

భోపాల్ - ప్రభాత సూర్యుడు



కేంద్రంలోని అధికార బీజేపీ తెలంగాణలో అధికార పార్టీ బీఆర్ఎస్ మధ్య రాజీ కుదిరిందని, ఈ రెండు పార్టీలది ఫెవికాల్ బంధమని, ఢిల్లీ లిక్కర్ స్కామ్‌లో ఎమ్మెల్సీ కవిత అరెస్ట్ అవ్వకపోవడమే ఇందుకు నిదర్శనమంటూ విస్తృతంగా ప్రచారం జరుగుతున్న వేళ ఆసక్తికర

మిగతా 2లో...

### ఈటెలకు
## ఢిల్లీ నుంచి ఫోన్ ?

**అభిమానులు, అనుచరుల్లో నరాలు తెగే ఉత్కంఠ..!**

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు



తెలంగాణ రాజకీయాలు ఆసక్తికర మలుపులు తిరుగుతున్నాయి. ప్రస్తుతం రాష్ట్రములో ఏ నోట విన్న ఈటల.. ఈటల.. తెలంగాణ రాజకీయాల్లో ఇప్పుడీ పేరు మార్మోగుతోంది.. గత కొన్నిరోజులుగా తెలంగాణ రాజకీయాల్లో ముఖ్యంగా బీజేపీలో నెలకొన్న పరిస్థితులతో ఈటల రాజేందర్ ఏం చేయబోతున్నారు..? కీలక నిర్ణయమే తీసుకుంటారా..? గత కొన్నిరోజులుగా ఆయన అసంతృప్తితో రగిలిపోతుండటానికి కారణాలేంటి..? బీజేపీలో కంటిన్యూ అవుతారా.. లేకుంటే కాంగ్రెస్ గూటికి చేరుతారా..? లేకుంటే ఈటల సతీమణి జమున ఒక్కరే కాంగ్రెస్ తీర్థం పుచ్చుకుంటారా..? ఇన్నిరోజులుగా

మిగతా 2లో...

## ఇదే సరైన సమయం..
# స్వాతంత్ర్య పోరాటం చేద్దాం..!

**మహారాష్ట్ర సర్కోలిలో జరిగిన సభలో తెలంగాణా ముఖ్యమంత్రి కెసిఆర్**



సర్కోలి - ప్రభాత సూర్యుడు

మహారాష్ట్రలోని సర్కోలిలో జరిగిన సభలో తెలంగాణా రాష్ట్ర ముఖ్యమంత్రి కెసిఆర్ మాట్లాడారు. ఈ దేశానికి లక్ష్యం ఏమైనా ఉందా అని ఆయన ప్రశ్నించారు. లేకుంటే ఊరికే ఉన్నామా అని అడిగారు. మేం ఎవరి టీమ్ కాదు.. మాది కిసాన్ టీమ్ అని సీఎం కేసీఆర్ అన్నారు. ఇదే సరైన సమయం అని, లక్ష్యం గురించి ఆలోచించాల్సిన అవసరం ఉందన్నారు. కొత్తగా స్వాతంత్ర్య పోరాటం చేపట్టాలని, కొత్త ఉదయం దిశగా.. క్రాంతి మార్గంలో దేశం నడవాలన్నారు. సౌత్ కొరియా, జపాన్, సింగపూర్ మలేషియా, లాంటి చిన్న దేశాలు ఎంతో ప్రగతి సాధించినట్లు సీఎం కేసీఆర్ తెలిపారు. చైనా.. ఓ దశలో పేద దేశమని, కానీ ఇప్పుడు చైనా ఎలా ఉందా తెలుసా అని ప్రశ్నించారు. మనం ఎక్కడ ఉన్నామని ఆయన ప్రశ్నించారు.

మిగతా 2 లో...

### తెలంగాణలో
## అటకెక్కిన పాలన

**వైఎస్ షర్మిల రెడ్డి**

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు



హైదరాబాద్ తెలంగాణ ప్రజల సొమ్ముతో మహారాష్ట్రలో బందిపోట్ల సోకు రాజకీయాలు. తెలంగాణ ప్రజలు ఓట్లు వేసిన పాపానికి ముఖ్యమంత్రి, మంత్రులు, ఎమ్మెల్యేలంతా మహారాష్ట్ర ప్రజలకు ఊడిగం చేస్తున్నారని వైఎస్సార్ తెలంగాణ పార్టీ అధినేత్రి షర్మిల అన్నారు. 'రాష్ట్ర ప్రభుత్వం' మొత్తం పక్క రాష్ట్రానికి తరలిపోయింది. దొర తెలంగాణకు ముఖ్యమంత్రా? లేక

మిగతా 2లో...

## కేంద్ర కేబినెట్ విస్తరణ అడుగులు..!

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

తొమ్మిదేళ్ళ పరిపాలన పూర్తి చేసుకుని ఎన్నికల ఏడాదిలోకి అడుగు పెట్టింది నరేంద్ర మోదీ ప్రభుత్వం. మరో 9, 10 నెలల్లో సార్వత్రిక ఎన్నికలు జరగబోతున్నాయి. మరోసారి నరేంద్ర మోదీ చరిష్మాను నమ్ముకునే భారతీయ జనతా పార్టీ ఎన్నికలకు సిద్ధమవుతోంది. అయితే, ఈసారి ఆయన చరిష్మానే బీజేపీని గట్టెక్కిస్తుందా అంటే గతంలో వున్నంత ధీమా కనిపించడం లేదు చాలామందిలో. బీజేపీ అభిమానులు సైతం మూడోసారి పార్టీ విజయంపై పూర్తిస్థాయి ధీమాలో లేరు. దానికి కారణం 2019నాటి బీజేపీకి 2023 నాటి బీజేపీకి తేడా కనిపిస్తోంది. ఆనాడు దేశంలో



దాదాపు 75 శాతం భూభాగం బీజేపీ లేదా దాని

మిగతా 3లో...

### ఐదు వందే భారత్ రైళ్లను ప్రారంభించిన
## ప్రధాని మోడీ



భోపాల్ - ప్రభాత సూర్యుడు

ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ మంగళవారం నాడు ఐదు వందే భారత్ రైళ్లను ప్రారంభించారు. మధ్యప్రదేశ్ లోని కమలాపతి–జబల్పూర్, ఖజురహో–భోపాల్–ఇండో ర్, మడ్ గావ్–ముంబై, ధార్వాడ్–బెంగుళూరు, హతియా–పాట్నా రూట్లలో ఈ రైళ్లు ప్రయాణిస్తాయి.

### కాంగ్రెస్ గూటికి
## చేరుతున్నాము

**క్లారిటీ ఇచ్చిన పొంగులేటీ, జూపల్లి**




న్యూఢిల్లీ - ప్రభాత సూర్యుడు

బీఆర్ఎస్ నుంచి బయటికి వచ్చిన ఖమ్మం జిల్లా కీలక నేత, మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నట్లుగా ప్రకటించారు. తాను జూలై 2 రాహుల్ గాంధీ సమక్షంలోనే కాంగ్రెస్ కండువా కప్పుకుంటానని స్పష్టం చేశారు రాహుల్ గాంధీని పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు సహా పార్టీకి చెందిన 35 మంది కీలక నేతలు కలిశారు. ఢిల్లీ వెళ్లి వీరంతా ఏఐసీసీ కార్యాలయంలో

మిగతా 2లో...

## ఎన్నికల వ్యూహం ప్రారంభించాం




న్యూఢిల్లీ - ప్రభాత సూర్యుడు

న్యూఢిల్లీలో ఏఐసీసీ కార్యాలయంలో మల్లికార్జున ఖర్గే అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సమావేశంలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, మాణిక్ రావు ఠాక్రే, రేవంత్ రెడ్డి, జానారెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి, షబ్బీర్ అలీ, సంపత్ కుమార్, తదితరలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. తెలంగాణ ఎన్నికల సన్నాహక సమావేశం జరిగిందన్నారు. 120 రోజుల్లో జరిగే ఎన్నికలలో ఎలా ముందుకు వెళ్లాలి.. కలిసి కట్టుగా పోరాటం చేయాలన్నారు. బీఆర్ఎస్‌ను ఎలా ఓడించాలని, బీజేపీనీ ఎలా ఎదుర్కోవాలి అనేదానిపై చర్చ జరిగిందని ఆయన వెల్లడించారుపది సంవత్సరాల్లో కేసీఆర్ పాలనలో అవినీతి పెరిగి పోయిందని, తెలంగాణ ప్రజల సంక్షేమం కోసం చర్చ జరిగిందని రేవంత్ రెడ్డి తెలిపారు. బీఆర్ఎస్ ను గద్దె దింపేందుకు సిద్ధం అయ్యామని, తెలంగాణ ఎన్నికల కార్యాచరణ మొదల యిందని ఆయన

మిగతా 3లో...

## ఇక ఐక్యతా రాగమేనా



హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

ఐదు నెలల్లో తెలంగాణతోపాటు ఐదు రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. వాటిన్నింటి కంటే తెలంగాణపై కాంగ్రెస్ ఎక్కువ ఫోకస్ పెట్టినట్టు కనిపిస్తోంది. అందుకే రెగ్యులర్‌గా తెలంగాణ కాంగ్రెస్ నేతలను ఢిల్లీకి పిలుపిస్తోంది. వారంతా సఖ్యతగా ఉంటూ పార్టీ విజయానికి చేపట్టాల్సిన ప్రోగ్రామ్స్‌ను చెబుతోంది. తెలంగాణలో జోష్ మీద ఉన్న కాంగ్రెస్ నేతలు ఢిల్లీకి పయనమయ్యారు. ఇన్నాళ్లూ ఉప్పు నిప్పులా

మిగతా 3లో...

# ఈటెలకు ఢిల్లీ నుంచి ఫోన్ ?

(మొదటిపేజీ తరువాయి)

ఊరించిన కీలక పదవి కథేంటి..? పొమ్మనలేక పొగపెడుతున్నారన్న వార్తల్లో నిజమెంత..? బీజేపీలో కంటిన్యూ అవుతూనే తనకున్న చేరికల కమిటీ పదవికి రాజీనామా చేస్తారా..? ఇలాంటి మరెన్నో ప్రశ్నలకు ఈటల దంపతుల నుంచి సమాధానాలు వస్తాయని అభిమానులు అనుకున్నారు కానీ.. సడన్‌గా ఈటల తన తన ప్రెస్‌మీట్‌ను రద్దు చేసుకున్నారు. దీంతో ఈటల రాజేందర్ పొలిటికల్ డైలమా కంటిన్యూ అవుతూనే ఉంది.. అయితే జమున మాత్రమే మీడియా ముందుకొస్తున్నారు. దీంతో ఆమె ఏం మాట్లాడుతారు..? కీలక ప్రకటన ఏమైనా ఉంటుందా..? అని కార్యకర్తలు వేయికళ్లతో వేచి చూస్తున్నారు.

కొద్దిరోజుల క్రితం దిక్కుతోచని స్థితిలో ఉన్న కాంగ్రెస్ పార్టీ.. కర్నాటక ఎన్నికల్లో విజయం తర్వాత ఒక్కసారి పరిస్థితులు మారిపోయాయి. మరోవైపు.. దూకుడు మీదున్న బీజేపీ డీలా పడిపోయింది. నేతలు ఎప్పుడెలా అడుగులేస్తారో తెలియని పరిస్థితి. పొంగులేటి, జూపల్లి కాంగ్రెస్ తీర్థం పుచ్చుకోవడానికి సర్వం సిద్ధం చేసుకున్నాక రాష్ట్ర రాజకీయాల్లో మరింత వేడెక్కాయి. సరిగ్గా ఈ సమయంలోనే ఈటల దంపతులిద్దరూ మీడియా ముందుకు రావాలనుకున్నారు. దీంతో తాజా రాజకీయ పరిణామాలు, బీజేపీలో నెలకొన్న పరిస్థితులు, అసలు బీజేపీలో కొనసాగే పరిస్థితి ఉందా లేదా..? అసలు అందరూ అనుకున్నట్లుగా ఆ కీలక పదవి సంగతేంటి..? ఇలా అన్ని విషయాలపై ఈటల మాట్లాడుతారని అందరూ భావించారు కానీ.. ఎందుకో రాజేందర్ సడన్‌గా ప్రెస్‌మీట్ రద్దు చేసుకున్నారు. వాస్తవానికి.. ఈటల కాంగ్రెస్‌లో చేరాలని చాలా రోజులుగా అనుచరులు, అభిమానులు ఒత్తిడి తెస్తున్నారు.. రోజురోజుకూ ఒత్తిడి పెరుగుతోంది. పైగా ఇప్పుడు బీజేపీలో కూడా పరిస్థితులు సరిగ్గా లేకపోవడంతో ఈ ప్రెస్‌మీట్ వేదికగా కీలక ప్రకటన చేసే అవకాశం ఉందని వార్తలు కూడా గుప్పుమన్నాయి. ఈ ప్రెస్‌మీట్‌తో ఆ ప్రశ్నలన్నింటికీ సమాధానం వస్తుందని అభిమానులు, అనుచరులు భావించారుగానీ సీన్ రివర్స్ అయ్యింది. ఈ గ్యాప్‌లో ఢిల్లీ నుంచి ఒకరిద్దరు అగ్రనేతలనుంచి ఫోన్ కాల్ రావడంతో ఈటల ప్రెస్‌మీట్ రద్దు చేసుకున్నారని తెలియవచ్చింది. అయితే ఆ ఫోన్‌కాల్‌లో ఏం మాట్లాడుకున్నారు..? ఏమైనా హామీ ఇచ్చారా.. పార్టీ మార్పు విషయంపై ఆరాతీశారా..? అనేది తెలియట్లేదు. అయితే రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ ఢిల్లీ పర్యటనతో ఈటల ప్రెస్‌మీట్ రద్దు చేసుకున్నారని.. ఢిల్లీ వేదికగా ఏం జరుగుతుందనేదానిపై తెలుసుకుని ఆ తర్వాత మీడియా ముందుకు రావాలని ఆయన భావిస్తున్నారని తెలుస్తోంది.

# తెలంగాణలో అటకెక్కిన పాలన

(మొదటిపేజీ తరువాయి)

మహారాష్ట్రకా? ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా, ప్రజల సమస్యలు పరిష్కరించకుండా. బందిపోట్లలాగా ఇక్కడి సంపదను కొల్లగొట్టి పక్క రాష్ట్రంలో ఖర్చు చేస్తున్నారు. రాష్ట్ర ప్రజానికం బీఆర్ఎస్ దుర్మార్గాలను గుర్తించాలి. ప్రజలను గాలికొదిలి రాష్ట్ర ప్రభుత్వం మొత్తం పక్క రాష్ట్రానికి వెళ్లిందంటే. తెలంగాణపై కేసీఆర్ కున్న చిత్తశుద్ధి ఏంటో గమనించాలి. వెళ్లే దారిలో కూడా ఇక్కడి ప్రజలను అవస్థలకు గురిచేసిన దొంగలు ఈ బీఆర్ఎస్ నేతలు. రాష్ట్రంలో పాలన అటకెక్కింది, వ్యవస్థలన్నీ శూన్యం. మన గ్రామాలు సందర్శించడానికి బీఆర్ఎస్ ఎమ్మెల్యేలకు, మంత్రులకు, ముఖ్యమంత్రికి తీరిక లేదు కానీ రాజకీయాల కోసం పక్క రాష్ట్రానికి వెళ్లే సమయం మాత్రం ఉంది. ఇక్కడ తిరిగి సమస్యలు తెలుసుకోలేని బందిపోట్లు. పక్క రాష్ట్రాల ప్రజలను ఉద్ధరిస్తామనడం ఈ దశాబ్దపు పెద్ద జోక్. తెలంగాణ ప్రజలారా ఇకనైనా మేలుకోండి. రాజకీయాలకు రంగులు మార్చే ఈ బీఆర్ఎస్ దొంగలను రాష్ట్రం నుంచే కాదు ఈ దేశం నుంచే తరిమికొట్టాలని ఆమె అన్నారు.

# కాంగ్రెస్ సీడబ్ల్యూసీలో తెలంగాణ నేతలు

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

కాంగ్రెస్ పార్టీలో అత్యున్నత నిర్ణయాధికారం దానిదే.. అదే సీడబ్ల్యూసీ- కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ.. ఏఐసీసీ జాతీయ అధ్యక్షుడిగా మల్లికార్జున్ ఖర్గే ఎన్నికైన తరువాత సీడబ్ల్యూసీ ని ఇంకా పునఃవ్యవస్థీకరణ చేయలేదు.. 2024ఎన్నికలు సమీపిస్తుండడంతో అగ్రనాయకత్వం సీడబ్ల్యూసీపై దృష్టి సారించింది. సీడబ్ల్యూసీ సభ్యులను ఎన్నుకోవడానికి ఎన్నిక అవసరం లేదని రాయపూర్ లో జరిగిన కాంగ్రెస్ ప్లీనరీలో తీర్మానం చేశారు. నిర్ణయాధికారం అధ్యక్షుడు ఖర్గేకి కట్టబెట్టారు.. సీడబ్ల్యూసీలో మొత్తం 35 మంది సభ్యులు ఉంటారు. అందులో ఏఐసీసీ 12 మందిని ఎన్నుకుంటుంది. మిగిలిన వారిని అధ్యక్షుడు ఎంపిక చేస్తారు. వీరితో పాటు శాశ్వత సభ్యులు కూడా ఉంటారు. అయితే, ఈసారి ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, మహిళా, మైనారిటీలకు 50 శాతం రిజర్వేషన్ కల్పించడంతో తెలంగాణ వారికి కూడా మొదటిసారి సీడబ్ల్యూసీ మెంబర్ దక్కనుంది.మరో రెండు రోజుల్లో సిడబ్ల్యూసి పునఃవ్యవస్తీకరణ జరుగనుంది.. తెలంగాణలో ఎన్నికల నేపథ్యంలో రాష్ట్రానికి కూడా అధిష్టానం అవకాశం కల్పించనుందని సమాచారం.. ఇప్పటికే బీజేపీ సైతం వారి అత్యున్నత పార్లమెంటరీ బోర్డులో రాజ్యసభ సభ్యులు లక్ష్మణ్ కి అవకాశం కల్పించారు.

# ఇదే సరైన సమయం.. స్వాతంత్ర్య పోరాటం చేద్దాం..!

(మొదటిపేజీ తరువాయి)

దీనిపై ఆలోచించాల్సి అవసరం ఉందన్నారు. మహారాష్ట్రలో ఏ పార్టీకి అధికారం రాలేదో చెప్పండి.. కాంగ్రెస్, శివసేన, బీజేపీలకు ప్రజలు అధికారం ఇచ్చారని, చేయాలనుకుంటే ఎవరైనా చేస్తారని, కానీ ఆ పార్టీలు ఏమీ చేయలేకపోయినట్లు సీఎం కేసీఆర్ తెలిపారు.రైతుల మంచి కోసం ఏదైనా చేయవచ్చు అన్నారు మహారాష్ట్ర పెద్ద రాష్ట్రం.. ధనవంతమైన రాష్ట్రం అన్నారు. మహా నేతలు దివాళా తీస్తారని.. కిసాన్లకు దివాళీ వస్తుందన్నారు. తనకు మరాఠీ రాదు అని, కానీ అన్నీ అర్థం చేసుకోగలనన్నారు. భారత్ పరివర్తన్ మిసన్ నడుస్తోందన్నారు. పండరీ దర్శనం కోసం వస్తే.. దర్శనం చేసుకోండి.. కానీ రాజకీయం చేయకండి అన్నారని కొందరు నేతలు అన్నట్లు సీఎం తెలిపారు. పండరీ పుణ్య స్థలం అని.. అక్కడ ఏమీ. చెప్పలేదు.. కాని ఇక్కడ అనకుండా ఉండలేనన్నారు. మహా నేతలు ఎందుకు ఆక్రోశానికి లోనవుతున్నారని ఆయన ప్రశ్నించారు. మేం ఎవరి టీమ్ కాదు.. కిసాన్ టీమ్ మాది.. అల్పసంఖ్యాకుల టీమ్ అని సీఎం కేసీఆర్ అన్నారు. అబ్ కీ బార్ కిసాన్ సర్కార్.. భాల్కే అన్నారని గుర్తు చేశారు.తెలంగాణ, మహారాష్ట్ర కోసం ఏర్పడిన పార్టీ తమది కాదన్నారు. దేశంలో ఉన్న సమస్యల న్నింటికీ.. పరివర్త భారత్ కావాలన్నారు. కోట్లాది ఎకరాల సాగు భూమికి నీరును అందిస్తామన్నారు. ఔరంగబాద్‌లో 8 రోజులకు ఒకసారి నీళ్లు వస్తాయన్నారు. సోలాపూర్‌లో 5 రోజులకు ఒకసారి వస్తాయన్నారు. అకోలాలో కూడా నీళ్లు రావడం లేదన్నారు.

కేంద్ర జలవిధానాన్ని బంగాళాఖాతంలో వేయాలన్నారు. జలనీతిని మార్చేస్తామన్నారు. నయా భారత్‌ను రూపొంది స్తామన్నారు. దేశంలో నీళ్లు లేవంటే అది మరో మాట అవుతుందని, కానీ నేతల మాయమాటలు చెప్పి నీళ్లు ఇవ్వలేకపోయినట్లు ఆరోపించారు.బొగ్గు విద్యుత్తు, సోలార్ పవర్, హైడ్రో పవర్, థర్మల్ పవర్ మాత్రం దేశంలో ఎటువంటి సమస్య లేదన్నారు. ఆ బొగ్గు రిజర్వులు బిలియన్ల టన్నుల్లో ఉన్నట్లు సీఎం కేసీఆర్ తెలిపారు. కావాల్సినంత బొగ్గు నిల్వలు ఉన్నప్పుడు.. విద్యుత్తు సమస్య ఎందుకు వస్తోందని ప్రశ్నించారు. హైడ్రో, సోలార్, బొగ్గును సమతుల్యం చేస్తే, అప్పుడు దేశవ్యాప్తంగా విద్యుత్తు సమస్య ఉండదన్నారు. 125 ఏళ్లకు కావాల్సినంత బొగ్గు మన దగ్గర ఉందన్నారు. రైతుల కోసం 24 గంటల పాటు ఉచిత విద్యుత్తును తెలంగాణ ప్రభుత్వం అందిస్తోందని సీఎం కేసీఆర్ తెలిపారు. రైతులు ఒక్కటి కాకుంటే, మార్పు ఉండదన్నారు. రైతులు బ్రతికి ఉంటే ఎవరు జీవిస్తారు.. రైతులు మరణిస్తే ఎవరు బ్రతుకు తారని ఆయన అన్నారు. దివ్యాంగులకు తెలంగాణ ప్రభుత్వం పెన్షన్ 4వేలు ఇస్తోందన్నారు. మహారాష్ట్రలో బీఆర్ఎస్ సర్కార్ వస్తే.. అన్ని సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తామన్నారు. వృద్ధులకు పెన్షన్ ఇస్తామన్నారు. అమెరికాలో నల్లజాతి వారిని ఎంతో వేధించారని, కానీ బరాక్ ఒబామాను గెలిపించి అక్కడి ప్రజలు ఆ రుణం తీర్చుకున్నట్లు కేసీఆర్ తెలిపారు. భారత్‌లో కూడా ఇలాంటి మార్పు రావాలని, రైతు ప్రభుత్వాన్ని ఎన్నుకోవాలన్నారు. తెలంగాణలో ధరణి పోర్టల్‌తో భూముల్ని డిజిటలైజ్ చేసినట్లు సీఎం తెలిపారు. తెలంగాణలో జరుగుతున్న పథకాల అమలు .. మహారాష్ట్రలో ఎందుకు జరగవని ఆయన నిలదీశారు. బీఆర్ఎస్‌లో చేరిన మరాఠీ నేత భగీరథ్ బాల్కేకు పూర్తి మద్దతు ఇస్తున్నట్లు కేసీఆర్ తెలిపారు.

పశ్చిమ మహారాష్ట్ర దర్వాజ్ ఓపెన్ చేసిన బాల్కేకు అండగా ఉంటామన్నారు. పండరీపుర వికాసం మొత్తం బాల్కే చేతుల మీదుగా జరుగుతుందన్నారు. రైతు ఇంట్లో పుట్టాను, నేను స్వయంగా రైతును, రైతు సంక్షేమం కోసం పనిచేస్తానని సీఎం కేసీఆర్ తెలిపారు. డిజిటల్ ఇండియా అని కేంద్రం చెబుతోందని, కానీ ఎందుకు భూముల్ని డిజిటైజ్ చేయడం లేదన్నారు. మేక్ ఇన్ ఇండియా అని ప్రధాని చెబుతారని, కానీ ప్రతి వీధిలో చైనా బజార్ ఎందుకు కనిపిస్తున్నట్లు ఆయన ప్రశ్నించారు. దీపావళి బాంబులు, రంగులన్నీ చైనా నుంచే ఎందుకు వస్తున్నాయని ప్రశ్నించారు. భారతదేశ పరివర్తనే అన్నింటికీ పరిష్కారం అన్నారు. ధరణి పోర్టల్లో ఒకసారి రైతు డేటా ఎక్కితే, దాన్ని ఎవరూ మార్చలేరన్నారు. ఒక్క రైతు బయోట్రిక్ ద్వారానే దాన్ని మార్చే వీలు ఉందన్నారు. తెలంగాణ రైతుల వద్ద పాస్‌పోర్టు లాంటి సుందరమైన పాస్ బుక్ ఉంటుందని అన్నారు. తాము ఎవరికీ టీం కాదు అని.. తమది రైతుల టీమ్, దళిత టీమ్ అన్నారు. రైతులు తోడుంటే ఎవరి అవసరం లేదన్నారు. అబ్ కీ బార్ .. కిసాన్ సర్కార్ అని సీఎం కేసీఆర్ నినాదాలు చేశారు. తమ విధానంలో న్యాయం, నీతి ఉందన్నారు. మరాఠీ నేత భగీరథ్ బాల్కే ఇవాళ సర్కోలీలో జరిగిన సభలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు.

# కాంగ్రెస్ గూటికి చేరుతున్నాము

## క్లారిటీ ఇచ్చిన పొంగులేటీ, జూపల్లి

(మొదటిపేజీ తరువాయి)

సమావేశం అయ్యారు. సమావేశం తర్వాత పొంగులేటి మీడియాతో మాట్లాడారు. బీఆర్ ఎస్ నుంచి బయటకు వచ్చాక ఏ మార్గంలో వెళ్లాలనే అంశంపై అనేక మంది అభిప్రాయాలు తీసుకున్నానని పొంగులేటి చెప్పారు. జూపల్లిలో కలిసి అనేక సభలు సమావేశాలు నిర్వహించి, ప్రజలు ఏం కోరుకుంటున్నారనే అభిప్రాయాలు తీసుకున్నామని చెప్పారు. గత మూడు నెలలుగా సర్వేలు చేయించుకున్నామని, 80 శాతానికి పైగా ప్రభుత్వ వ్యతిరేక ఓటు ఉందని అన్నారు. ఒక పార్టీ పెట్టే అంశంపై కూడా చాలా మందిని అడిగినట్లు చెప్పారు. పార్టీ పెడితే ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలుతుందని, అలా జరగకుండా చూడాలని చాలా మంది చెప్పారని అన్నారు. తన అనుచరులు, ప్రజల అభిప్రాయం మేరకు తాను కాంగ్రెస్‌లో చేరాలని నిర్ణయించుకున్నట్లు చెప్పారు. పదవులు ఇవ్వలేదని పార్టీ మారానని అనడం సరి కాదని అన్నారు. తెలంగాణ వస్తే మంచి జరుగుతుందని సోనియా గాంధీ ప్రత్యేక రాష్ట్రాన్ని ఇచ్చారని అన్నారు. ప్రత్యేక రాష్ట్రాన్ని తెచ్చుకున్నా అనుకున్నది జరగడం లేదని, నీళ్లు, నిధులు, నియామకాలు ఏమయ్యాయని ప్రశ్నించారు. తెలంగాణ బిడ్డలు ఆత్మగౌరవాన్ని కోల్పోతున్నారని ఆవదేన వ్యక్తం చేశారు.జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ.. నష్టం వస్తుందని తెలిసినా ప్రత్యేక రాష్ట్రం ఇచ్చిన కాంగ్రెస్ వెంటనే తాను నడవాలనే ఉద్దేశంతోనే కాంగ్రెస్ పార్టీలో చేరాలని నిర్ణయించుకున్నట్లు చెప్పారు. వచ్చే నెల 2న రాహుల్ గాంధీ సమక్షంలో చేరతానని వెల్లడించారు. కేసీఆర్ నియంతృత్వ ధోరణి పరాకాష్ఠకు చేరిందని.. మంత్రుల్ని కూడా సీఎం కేసీఆర్ మనుషులుగా చూడడం లేదని అన్నారు. ఈ సారి కాంగ్రెస్‌కు అధికారం ఇవ్వకపోతే ప్రజల్ని దేవుడు కూడా క్షమించడని అన్నారు. తెలంగాణ వచ్చాక తమ అంచనాలన్నీ తప్పాయని.. కేసీఆర్ పాలన అంతా బోగస్ మాటలు, పథకాలతో సాగుతోందని విమర్శించారు. ఎప్పటికప్పుడు కొత్త పథకాలతో జిమ్మిక్కులు చేస్తూ.. ప్రశ్నించే గొంతే ఉండొద్దని కేసీఆర్ భావిస్తున్నారని అన్నారు. కేసీఆర్ తీరు రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్‌ను కూడా అవమానించేలా ఉందని అన్నారు. దేశంలో ఎన్నడూ లేనంతగా ప్రచారానికి ప్రజల డబ్బును ఖర్చుపెడుతున్నారని జూపల్లి కృష్ణారావు విమర్శించారు.

**కనీవినీ ఎరుగని సభ**

తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకున్నప్పటికీ అనుకున్న అభివృద్ధి జరగలేదని మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. సీఎం కేసీఆర్ పాలనపై విమర్శలు చేశారు. అందుకే కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నానన్న ఆయన... జులై 2న పార్టీలో చేరుతున్నట్లు ప్రకటించారు. రాష్ట్రం ఏర్పడినా తెలంగాణ బిడ్డలు ఏం కోరుకున్నారో అవి జరగలేదని ఆరోపించారు. కేసీఆర్ కుటుంబం అవినీతి వల్ల ప్రజలకు దక్కాల్సినవి దక్కడం లేదన్నారు. మోసపూరిత హామీలతో ప్రజలను మభ్యపెట్టి బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిందని తెలిపారు. జులై 2 ఖమ్మంలో కనీవినీ ఎరుగని సభ నిర్వహిస్తామన్నారు. కేసీఆర్ కు అధికారం ఇచ్చినందుకు రాష్ట్రంలో ఏం జరుగుతుందో అందరికీ తెలుసన్నారు. తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని కేసీఆర్ దెబ్బతీశారని విమర్శించారు. తనను బీఆర్ఎస్ పార్టీ నుంచి సస్పెండ్ చేశారనో, పదవుల కోసమే తాను పార్టీ మారడంలేదన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని గద్దె దించేందుకే కాంగ్రెస్‌లో చేరుతున్నట్లు పొంగులేటి స్పష్టం చేశారు. పదవులు ఇవ్వలేదని బీఆర్ఎస్ నుంచి బయటకు రాలేదన్నారు. బీఆర్ఎస్‌ను గద్దె దించేందుకే పార్టీ నుంచి బయటకు వచ్చి కాంగ్రెస్‌లో చేరుతున్నట్లు వెల్లడించారు. తనకు పదవులు ముఖ్యం కాదన్న ఆయన... పదవుల కంటే తనకు ఆత్మాభిమానమే ముఖ్యమని తెలిపారు. ఓ దశలో ప్రాంతీయ పార్టీ పెట్టాలని భావించినా...కొత్త పార్టీతో ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలుతుందని భావించి కాంగ్రెస్‌లో చేరాలని నిర్ణయించుకున్నట్లు పేర్కొన్నారు.

# బీఆర్ఎస్‌పై స్వరం మార్చిన ప్రధాని మోదీ

(మొదటిపేజీ తరువాయి)

పరిణామం చోటుచేసుకుంది. బీఆర్ఎస్ టార్గెట్‌గా ప్రధాని నరేంద్ర మోదీ ఘాటైన వ్యాఖ్యలు చేశారు. కేసీఆర్ బిడ్డ గెలవాలంటే బీఆర్ఎస్‌కు ఓటు వేయండి అంటూ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. దేశ ప్రజలు గెలవాలంటే బీజేపీకి ఓటు వేయాలని పిలుపునిచ్చారు. మధ్యప్రదేశ్‌లోని భోపాల్ వేదికగా జరిగిన కార్యక్రమంలో ప్రధాని మోదీ ఈ మేరకు హాట్ కామెంట్స్ చేశారు. సాధారణంగా ప్రధాని మోదీ పేరు ఎత్తకుండా పరోక్షంగా విమర్శిస్తుంటారు. కానీ ఈసారి మాత్రం ఏకంగా సీఎం కేసీఆర్, ఎంఎల్సీ కవిత పేర్లు ప్రస్తావించి మరీ ఎటాక్ చేశారు. మొత్తంగా తెలంగాణలో కేసీఆర్ సర్కారును గద్దె దించాలని అర్థం వచ్చేలా స్పష్టమైన వైఖరిని కనపరచడం రాజకీయ వర్గాల్లో ఆసక్తికరంగా మారింది. మొదటిసారి కేసీఆర్‌పై మోదీ ప్రత్యక్షంగా విమర్శలు గుప్పించారని చర్చించుకుంటున్నారు. కాగా మధ్యప్రదేశ్ అసెంబ్లీకి త్వరలోనే ఎన్నికలు జరగనున్నాయి. ఈ మేరకు అన్ని రాజకీయ పార్టీలు ప్రచార కార్యక్రమాలను మొదలుపెట్టారు. ఇందులో భాగంగా బీజేపీ పలు కార్యక్రమాలను నిర్వహించింది. మంగళవారం నిర్వహించిన పలు ఈవెంట్స్‌లో ప్రధాని మోదీ సహా పలువురు కీలక నేతలు పాల్గొన్నారు.

# కేంద్ర కేబినెట్ విస్తరణ అడుగులు..!

(మొదటిపేజీ తరువాయి)

మిత్ర పక్షాల పరిపాలనలో వుంది. కానీ ఇపుడు పరిస్థితి అలా లేదు. మరీ ముఖ్యంగా కర్నాటక అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తర్వాత బీజేపీ గ్రాఫ్ పడిపోయిందన్న విశ్లేషణలు మీడియాలోను, సోషల్ మీడియాలోను విస్తృతంగా వస్తున్నాయి. అదేసమయంలో నరేంద్ర మోదీకి పెరుగుతున్న ఇంటర్నేషనల్ ఇమేజీ మాత్రం ఎవరికీ అందనంత స్థాయికి చేరింది. తాజాగా అమెరికా, ఈజిప్ట్ పర్యటనల తర్వాత మోదీ చరిష్మా అమాంతం పెరిగిపోయింది. ప్రపంచంలో అత్యంత ప్రజాదరణ వున్న నేతల మీద జరిగిన సర్వేలో మోదీ ఏకంగా 76 శాతం ఆమోదాన్ని పొందారు. అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ ఈ జాబితాలో ఎక్కడో వున్నారు. ఇంకోవైపు ముస్లిం అధినేతలున్న దాదాపు 13 గల్ఫ్ కంట్రీస్ తమ దేశ అత్యున్నత పురస్కారాన్ని నరేంద్ర మోదీకి ఇవ్వడం ద్వారా మోదీ పనితీరుకు ఫిదా అయినట్లు తేటతెల్లం చేశారు. ఇదంతా నాణేనికి ఒకవైపే. మరి ఎన్నికల సంవత్సరంలో మోదీ ఎలాంటి చర్యలు తీసుకోవడం ద్వారా దేశీయంగా తన ప్రభుత్వం ఇమేజీని పెంచుతారు ? ఇదిపుడు చాలా మంది విశ్లేషిస్తున్న అంశం.చరిష్మాలో మోదీని కొట్టే నేత దేశంలో ఎవరు లేరన్నది కొందరికి జీర్ణం కాకపోయినా నిజమేనని చెప్పాలి. అయితే, ప్రభుత్వంలో ఒక్క మోదీ మాత్రమే ఆదరణీయ నాయకుడు అయితే చాలా ? మిగిలిన వారు కూడా అలా వున్నప్పుడే ఎన్నికల్లో ప్రజలను మెప్పించ గలరన్నది చాలా మంది అభిప్రాయం. భారత్ వంటి పెద్ద దేశంలో ఒక్క ప్రధాన మంత్రి మాత్రమే ప్రమాణాలు కలిగిన వ్యక్తి అయితే చాలదు. ఆయన మంత్రివర్గం కూడా ప్రజలను మెప్పించేదిగా వుండాలి. గత తొమ్మిదేళ్ళుగా అన్ని తానై పరిపాలిస్తున్న మోదీకి ఏదైనా మచ్చ వుంది అంటే అది ఆయన కేబినెటేనని చెప్పాలి. మోదీ కేబినెట్‌లో రాజ్‌నాథ్ సింగ్, అమిత్ షా, నితిన్ గడ్కరీ, జయ శంకర్, పియూష్ గోయెల్, మన్‌సుఖ్ మాండవీయ వంటి వారు కాస్త ఇండిపెండెంట్‌గా వ్యవహరిస్తూ తమదైన ముద్ర ఆయా శాఖలపై వేస్తున్నారు. మిగిలిన వారిలో చాలా మంది స్వతంత్రంగా వ్యవహరించలేకపోతున్నారన్నది విశ్లేషకుల మాట. చాలా మంది క్రియాశీలకంగా వ్యవహరిస్తున్నా.. ఒకరిద్దరు అసమర్థులుంటే చాలు మొత్తం మంత్రివర్గానికి చెడ్డపేరు రావడానికి. అలాంటి పరిస్థితే ఇపుడు మోదీ ప్రభుత్వంలో కనిపిస్తుంది. మొన్నటి ఒడిశా రైలు ప్రమాదంతో సంబంధిత మంత్రి అశ్వినీ వైష్ణవ్‌పై ఈ తరహా కామెంట్లే వచ్చాయి. నిజానికి ప్రమాదం జరగడానికి ఇంకా కారణాలు పూర్తిగా తేలకపోయినా ప్రమాదానికి మంత్రి వైఫల్యమూ ఒక కారణమనే చాలా మంది భావిస్తున్నారు. బహుశా ఈ అపప్రథ తప్పించుకోవడానికే కాబోలు అశ్వినీ వైష్ణవ్ .. ప్రమాదం జరిగిన తర్వాత తిరిగి రైళ్ళ పునరుద్ధరణ జరిగే వరకు అంటే దాదాపు 56 గంటల పాటు ప్రమాద స్థలాన్ని వీడలేదు. గతంలో ఏ మంత్రి పని చేయనంతగా గ్రౌండ్ లెవెల్లో అశ్వినీ వైష్ణవ్ పని చేశారు. రాత్రింబవళ్ళు అక్కడి కార్మికులతో మమేకమై ట్రాక్ పునరుద్ధరణ జరిగేలా చూశారు. ఈరకంగా ఆయన కొంత మంది అభిమానాన్ని చూరగొనవచ్చు గాక? కానీ ప్రమాదం మచ్చను మాత్రం పూర్తిస్థాయిలో తప్పించలేకపోయారు.

## సంపాదకీయం

# వయసు శరీరానికి కానీ, మనసుకు కాదు:



వృద్ధాప్యం మానవ జీవితంలోని దశలలో ఒకటి. ఈ వృద్ధాప్య దశలో మానవ శరీరం అనేక శారీరక మరియు మానసిక మార్పులకు లోనవుతుంది మరియు గత జ్ఞాపకాలను గుర్తు చేస్తుంది. వృద్ధాప్యం అనేది అపారమైన అనుభవాలతో నిండిన జీవితం. వారు చెప్పే ప్రతి మాట నిజమని పెద్దలు అనుభవపూర్వకంగా చెబుతారు. అందుకే "పెద్దల మాట చద్దన్నం మూట" అనే నానుడి పుట్టింది.

మన దైనందిన జీవితంలో చాలామంది 60 యేండ్లు నిండకముందే అనేక వ్యాధులతో పోరాడుతూ వారి శరీరం ఏ పని చేయడానికి కూడా సహకరించలేనటువంటి పరిస్థితులను చూస్తూనే ఉంటాము. మానసిక స్థైర్యం మానసిక సమతుల్యత ను దెబ్బతీసి శారీరక, మానసిక సమస్యల తీవ్రతను పెంచడమే దీనికి కారణం. అంతేకాకుండా మానసిక స్థైర్యం ఉన్నవారు వయసు పెరుగుతున్న కొద్దీ ఎంతో ఉత్సాహంగా, ఉల్లాసంగా పని చేస్తూ ఎందరికో ఆదర్శంగా నిలుస్తున్నవారు తారసపడు తుంటారు. బహుశా అలాంటి వారిని చూసే " వయసు శరీరానికి కానీ, మనసుకు కాదు" అనే నానుడి పుట్టుకొచ్చిందనిపిస్తుంది. అలాంటి స్ఫూర్తిదాయకమైన 91 ఏళ్ల విశ్రాంత ఉపాధ్యాయుడు, వేద పండితులు రాజారామ్ శాస్త్రి యదార్థ జీవిత కథ.

**జననం, విద్యాభ్యాసం:**

సూర్యాపేట జిల్లాలోని మిర్యాల అనే మారుమూల గ్రామంలో బ్రాహ్మణ కుటుంబంలో సుబ్బయ్య శాస్త్రి, లక్ష్మి భాగ్యమ్మ దంపతులకు 06-10-1932 న జన్మించారు.. అయన తండ్రి సుబ్బయ్య గారు ప్రముఖ వేదపండితులు. చుట్టుపక్కల గ్రామాలలో జరిగే శుభ కార్యాలన్నీ ఆయనే జరిపేవారు. రాజారామ్ శాస్త్రి గారు చదువుకునే రోజుల్లో పదవయేట అయన తండ్రి పడుతున్న కష్టాన్ని చూసి తాను కూడా పురోహితం నేర్చుకొని తండ్రికి సహాయం అందించాలనే ఆలోచన కలిగింది. మొదటగా తన తండ్రి దగ్గర గాయత్రి మంత్ర శ్లోకాలతో ప్రారంభించి అతి తక్కువ సమయంలోనే అన్ని కార్యాలను నిర్వహించే విధంగా వేద మంత్రాలు నేర్చుకోగలిగారు. గ్రామంలోని చిన్న చిన్న కార్యాలను నిర్వహిస్తూనే తన విద్యాభ్యాసాన్ని కొనసాగించారు. తీవ్రమైన ఏకాగ్రత, అంకితభావంతో చదువు ప్రారంభించి మంచి విద్యా ప్రతిభ ఉన్న విద్యార్థిగా పేరు తెచ్చుకున్నారు.

**ఉద్యోగ ప్రస్థానం:**

చదువుతోపాటు, పురోహితం లో మంచి నైపుణ్యం సంపాదించడమే గాక అయన 27 .04 .1954 న ప్రభుత్వ టీచర్ గా ప్రస్థానాన్ని ప్రారంభించారు. కొంతకాలం సూర్యాపేట మారుమూల గ్రామాలలో ఉద్యోగం చేసి బదిలీ అయిన తర్వాత గుమ్మడవెల్లి గ్రామానికి ప్రైమరీ స్కూల్ టీచర్ గా నియమితులైనారు. అప్పుడే గుమ్మడవెల్లి లో పాఠశాల ప్రారంభమైంది. అతి తక్కువ విద్యార్థులతో సాగుతున్న పాఠశాలకు రాజారాం సార్ రాకతో విద్యార్థుల సంఖ్య విపరీతంగా పెరిగింది. ఉపాధ్యాయులుగా విద్యార్థులకు పాఠాలే కాకుండా క్లాసురూం లో నవ్వులు పువ్వులు పూయించేవారు. ఆయన నోట పాఠాలే కాకుండా అప్పుడప్పుడు పాటలందుకునే పాటల పూదోట రాజారామ్ శాస్త్రి. కచ్చితమైన సమయాన్ని పాటిస్తూ, మంత్రముగ్ధులను చేసే ఆయన బోధనకు ఆకర్షితులైన విద్యార్థులు ఆయన చెప్పే పాఠాలకు గైర్హాజర్ కారంటే అతిశయోక్తి కాదు. ఆయన బోధన తీరు ఓ అద్భుతం పాఠానికి తగ్గట్టుగా ఉదాహరణలతో బోధించేవారు. తన సబ్జెక్ట్ తెలుగు అయినప్పటికీ ఉపాధ్యాయుల కొరత కారణంగా ఇతర సబ్జెక్టులను కూడా బోధించేవారు. విద్యార్థుల భవిష్యత్తు కోసం రాజారామ్ శాస్త్రి గారు అందించిన శ్లాఘనీయమైన సేవలు గుమ్మడవెల్లి విద్యార్థులు ఎప్పటికి మరిచిపోలేనివి, మరుపురానివి.

ఆయన వద్ద శిష్యరికం చేసిన విద్యార్థులంతా ఉన్నత శిఖరాలను అధిరోహించారు. రాజారామ్ శాస్త్రి గారు 1990 సంవత్సరంలో గుమ్మడవెల్లి లో పదవి విరమణ పొందారు.

**పురోహితం లో 80 ఏళ్ల సుదీర్ఘ ప్రస్థానం:**

పదేళ్ల వయసులో తండ్రి వద్ద నేర్చుకున్న పురోహితం ఆయన పదవీ విరమణ చేసిన తర్వాత కూడా జీవన ఉపాధి కోసం కొనసాగుతుండటం గొప్ప విషయం. అంతేకాదు 91 ఏళ్ల వయసులో 80 ఏళ్ల అర్చక అనుభవం కలిగి ఉండటం మరో గొప్ప విషయం. చుట్టుపక్కల గ్రామాల్లో పూజారులు లేకపోవడంతో ఆ గ్రామాల్లో జరిగే కార్యములన్నిటిని కూడా శాస్త్రి గారు నిర్వహిస్తారు. ఆయన చేతుల మీదుగా ఇప్పటి వరకు కొన్ని లక్షలకు పైగా వివాహాలు జరిగిపోయాయంటే అతిశయోక్తి కాదు. గుమ్మడవెల్లి గ్రామంలో ఉన్న ప్రతి ఒక్కరి పెళ్లి ఆయన చేతుల మీదుగా జరిగినవే. అంతేకాకుండా గుమ్మడవెల్లి లో ఉన్న ప్రతి కుటుంబంలో 1960 నాటి నుంచి ఇప్పటివరకు అన్ని కార్యాలు రాజారామ్ శాస్త్రి గారు నిర్వహిస్తుండటం ఒక సరికొత్త రికార్డు సృష్టించాడు. 91 ఏళ్ల వయసులో ఉన్న శాస్త్రి గారు ఇప్పటికీ స్వయంగా వంట, ఇంటి పనులు చేస్తూ అందరినీ ఆశ్చర్యపరుస్తున్నాడు. వయసు శరీరానికి కానీ, మనసుకు కాదు అన్నట్లుగా ఆయన ఇప్పటికి పూజలు నిర్వహించే కార్యక్రమాలలో వేద మంత్రాలు 2 గంటలకు పైగా ఆపకుండా చదివే శక్తి ఆయనకు ఉంది. జన్మనామం ప్రకారం భవిష్యత్తు పరిణామాలను అంచనా వేయడంలో రాజారామ్ శాస్త్రి గారి తరువాతే ఎవరైనా కాబట్టి వాస్తు శాస్త్రం,జ్యోతిష్యం, ఆలస్య వివాహాలు మరియు అనేక ఇతర సమస్యల పరిష్కారం కోసం పలు జిల్లాల నుంచి ప్రజలు అతనిని సంప్రదిస్తారు, ఇది అతని పనికి నిదర్శనం. ఆయన నిరుపేదల పట్ల దయ, కరుణ, ప్రేమ చూపే వ్యక్తి. అందుకే శాస్త్రి గారు పేదల కార్యక్రమాలకు వారి స్థాయికి తగ్గట్టుగా డబ్బులు తీసుకొని, కట్టలేని వారి దగ్గర డబ్బులు తీసుకోకుండా ఉచితంగా సేవలు అందిస్తున్నారు. పేదల పట్ల మానవత్వం చూపే గొప్ప మనసున్న వ్యక్తి. గుమ్మడవెల్లి గ్రామంలో జరిగే ప్రతి పండుగలో ప్రజలను మంత్రముగ్ధులను చేసే వేద మంత్రాలను పఠిస్తూ భక్తులకు వేద మంత్రాల అర్థాన్ని విపులంగా వివరిస్తారు.

**వయసు శరీరానికి కానీ, మనసుకు కాదు:**

వయసు శరీరానికే కానీ మనసుకు కాదు అని చెప్పే వాళ్ళని మనం చూశాం కానీ, వయసు శరీరానికి దూరం అన్నట్లుగా రాజారాం శాస్త్రి దినచర్య అందరినీ ఆశ్చర్యపరుస్తుంది. వృద్ధాప్యాన్ని జీవితంలో అత్యంత నీచమైన దశగా భావించి అసలు వాస్తవాన్ని గుర్తించలేని వారికి శాస్త్రి జీవితం ఆదర్శప్రాయం. ప్రతి మనిషికి సమస్యలు రావడం సహజమే అనడంలో సందేహం లేదు. ఏదైనా సమస్యను పరిష్కరించడానికి ఆలోచనే ఉత్తమమైన మార్గమని కొద్ది మందికి తెలుసు. మనం నిత్య జీవితంలో చిన్న చిన్న సమస్యలపై అనవసర ఆలోచనల వల్ల అనారోగ్యానికి గురి కావడం చూస్తూనే ఉన్నాం. ఒక సందర్భంలో శాస్త్రి గారిని తన ఆరోగ్య రహస్యం గురించి అడిగినప్పుడు, అతను ఇలా సమాధానమిచ్చాడు. ఎంత పెద్ద సమస్యనైనా ఎదుర్కొనే ధైర్యం మనలో ఉంటె ఏ శక్తి ఆపలేదు. ధైర్యంతో ముందడుగు వేసినపుడే నువ్వు ప్రపంచాన్ని జయించి గలుగుతావు అని అన్నారు ఆయన. ఉద్యోగం రాక ఆందోళన చెందుతున్న విద్యార్థులకు ఆయన మనోధైర్యాన్ని అందిస్తారు. 91 సంవత్సరాల శాస్త్రి గారు ఇప్పటికి పాఠ్య పుస్తకం లోని అంశాల గురించి చాలా చక్కగా వివరించడం గొప్ప విషయం. విద్యార్థుల బంగారు భవిష్యత్తు కోసం ఆయన అందించిన శ్లాఘనీయమైన విద్య సేవలు మరువలేనివి. జీవితంలో ఏదైనా సాధించాలంటే స్పష్టమైన లక్ష్యాన్ని నిర్దేశించుకుని సరైన మార్గంలో ముందుకు సాగాలని, లక్ష్య సాధనకు ఎలాంటి అడ్డంకులు ఉండవనేది ముమ్మాటికీ నిజం. రాజారామ్ శాస్త్రి గారి నిజ జీవితం ఎందరికో ఆదర్శం.



**– వ్యాసకర్త / జేసిఐవి సంఘం**
**ప్రధాన కార్యదర్శి**
**కోట దామోదర్**
**మొబైల్: ౦91 9391480475**

## గ్రూప్ -4 పరీక్షను ప్రశాంత వాతావరణంలో

# పారదర్శకరా నిర్వహించాలి

**జిల్లా కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా**




**జగిత్యాల – ప్రభాత సూర్యుడు**

తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించే గ్రూప్ -4 పరీక్షను ప్రశాంతంగా, నిబంధనలకు అనుగుణంగా, పారదర్శకంగా నిర్వహించాలని, ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు ఏర్పాట్లు చేపట్టాలని జిల్లా కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా అన్నారు. జూలై 01న టిఎస్పీఎస్సీ నిర్వహించే గ్రూప్ 4 పోటీ పరీక్ష నిర్వహణ ఏర్పాట్లపై మంగళవారం రోజున సమీకృత కలెక్టరేట్ సమావేశ మందిరం లో లైజన్ అధికారులు, చీఫ్ సూపరిం టెండెంట్ లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో గతంలో నిర్వహించిన గ్రూప్ 1 పరీక్ష ప్రశాంతంగా, విజయవంతంగా నిర్వహించామని తెలిపారు. జూలై ఒకటిన రెండు పూటలు నిర్వహించే గ్రూప్ 4 పరీక్ష నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేయాలని అన్నారు. లైజన్ అధికారులు, చీఫ్ సూపరింటెండెంట్ లు కేంద్రాలను పరిశీలించాలని, సీటింగ్, లైటింగ్, మరుగుదొడ్లు, త్రాగునీరు, సిసి కెమెరాలు వంటివి పరిశీలించాలని అన్నారు. వర్షా కాలం కారణంగా రూట్ లో ఇబ్బం దులు తలెత్తకుండా, ముందస్తు ఏర్పాట్లు చేపట్టాలని అన్నారు. టిఎస్పీఎస్సీ గైడ్ లైన్స్ ప్రతీ ఒక్కరు చదవాలని, నిబంధనలు పాటించాలని ఆదేశించారు. జిల్లాలో ఏర్పాటు చేసిన 73 కేంద్రాలలో 21,937 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరు కానున్నారని తెలిపారు. ప్రతీ కేంద్రంలో ఆశ, ఎఎన్ఎం లను, అవసరమైన మందులను సమకూర్చాలని తెలిపారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగకుండా చూడాలని తెలిపారు. పరీక్ష రాసే అభ్యర్థులు పరీక్ష కేంద్రాలకు వెళ్లేందుకు రవాణాలో ఎలాంటి అంతరాయం కలుగకుండా అన్ని రూట్లలో పరీక్ష సమయానికి ముందే బస్సులను నడిపించాలని తెలిపారు. కేంద్రాలలో పారిశుధ్య పనులు మునిసిపల్, పంచాయతీ సిబ్బంది చే నిర్వహించాలని అన్నారు. మిషన్ భగీరథ నీటిని ఆయా కేంద్రాలకు సరఫరా చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. మహిళా అభ్యర్థులను మహిళా పోలీసు సిబ్బంది తనిఖీలు చేయడం జరుగు తుందని తెలిపారు.అదనపు కలెక్టర్ బి.ఎస్.లత మాట్లాడుతూ, జిల్లా వ్యాప్తంగా 73 కేంద్రాలలో 21,937 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరు కానున్నారని, ఆయా కేంద్రాలకు కేటాయించిన అభ్యర్థులకు పరీక్ష రాసేందుకు సీటింగ్ ఏర్పాట్లు, సిసి కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, ఇన్విజిలేషన్ డ్యూటీ లు వేయాలని, కేంద్రాలలో మౌలిక సదుపాయాలు వంటి ఏర్పాట్లు చేయాలని అన్నారు. పరీక్ష రోజున ఉదయం 7.30 గంటలకే లైజన్ అధికారులు, చీఫ్ సూపరింటెండెంట్ లు ఆయా కేంద్రాలకు చేరుకోవాలని తెలిపారు.

టీఎస్పీఎస్సీ జారీచేసిన నిబంధనలు, మార్గదర్శకాలకు అనుగుణంగా విధులు నిర్వహించాలని అన్నారు. నిర్ణీత సమయానికి అభ్యర్థులను కేంద్రం లోకి నిశిత పరిశీలన చేసి పంపించాలని, ఎలాంటి ఎలక్ట్రానిక్ పరికరాలు గాని, ఖరీదైన వస్తువులను కేంద్రంలోకి అనుమతించబోమని స్పష్టం చేశారు. ఆయా పరీక్ష కేంద్రాల పరిధిలో 144 సెక్షన్ విధించడంతో పాటు, జీరాక్స్ కేంద్రాలను మూసి వేయడం జరుగుతుందని తెలిపారు. పరీక్ష కేంద్రాల పరిధిలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. చీఫ్ సూపరింటెండెంట్ లు ఆయా కేంద్రాల్లో హాజరైన, ఆబ్సెంట్ అయిన అభ్యర్థుల వివరాలు తెలియజే యాలని అన్నారు. వోఎంఆర్ సీట్ పై అభ్యర్థి వేలి ముద్రలు తీసుకోవాలని తెలిపారు. ఏయే సమయానికి విధులు నిర్వహించాలి,వోఎంఆర్ సీట్ ల పంపిణీ, తదితర అంశాలపై పూర్తిగా వివరించారు. ఎలాంటి ఆభరణాలు ధరించకూడదని, చెప్పులు మాత్రమే ధరించాలని తెలిపారు. అందరి సహకారంతో పరీక్షను ప్రశాంతంగా నిర్వహించాలని తెలిపారు. ఆర్డీవో వినోద్ కుమార్ మాట్లాడుతూ, లైజన్ అధికారులు, చీఫ్ సూపరింటెండెంట్లు సమ న్వయం చేసుకుంటూ పరీక్షను ప్రశాంతంగా నిర్వహిం చాలని అన్నారు. డీఎస్పీ ప్రకాష్ మాట్లాడుతూ, పరీక్ష రాసే అభ్యర్థులను నిశిత పరిశీలనకు పురుషులు, మహిళా పోలీసు సిబ్బందిని విడివిడిగా నియమిస్తామని తెలిపారు. ఎలాంటి సమస్యలు ఉంటే పోలీసు అధికారులకు తెలియ జేయాలని తెలిపారు. బందోబస్తు లో పోలీసు సిబ్బందిని నియమిస్తామని తెలిపారు. మెట్ పల్లి డీఎస్పీ రవీందర్ రెడ్డి మాట్లాడుతూ, ప్రతీ అభ్యర్థి చెప్పులు మాత్రమే ధరించాలని, ఎలక్ట్రానిక్ పరికరాలు పరీక్ష కేంద్రాలలోనికి అనుమతించబోమని తెలిపారు. ఈ సమావేశంలో రవీందర్ కుమార్ , వివిధ విద్యాసంస్థల ప్రిన్సిపల్స్, లైజన్ అధికారులు, చీఫ్ సూపరింటెండెంట్ లు, ఫ్లైయింగ్ స్క్వాడ్ లు, తదితరులు పాల్గొన్నారు.

# న్యూయార్క్‌లో పాఠశాలలకు సెలవుదినంగా దీపావళి పర్వదినం

**న్యూయార్క్ – ప్రభాతసూర్యుడు:** హిందువులు ఎంతో ఘనంగా జరుపుకునే దీపావళి పండుగకు న్యూయార్క్ ప్రాధాన్యత కల్పించింది. దీపావళి పర్వ దినాన న్యూయార్క్‌లో పాఠశాలలకు సెలవుదినంగా ప్రకటించింది. ఈ మేర కు నగర మేయర్ ఎరిక్ ఆడమ్స్ సోమవారం ప్రకటన విడుదల చేశారు. దీపావళి రోజున స్కూళ్లకు సెలవు ప్రకటించే చట్టంలో భాగమైనందుకు గర్విస్తున్నట్లు చెప్పారు. 'దీపావళి పర్వదినాన స్కూళ్లకు సెలవు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సాగిన పోరాటం అసెంబ్లీ మెంబర్ జెనిఫర్ రాజ్‌కుమార్, సంఘం నాయకులకు అండగా నిలిచినందుకు గర్వపడుతున్నాను. ఈ ప్రకటనతో దీపావళి ముందుగానే వచ్చినట్లయ్యింది' అని మేయర్ ఎరిక్ అన్నారు.నగరంలోని స్కూళ్లకు దీపావళి రోజున సెలవు ఇవ్వాల్సిందేనంటూ న్యూయార్క్ అసెంబ్లీ సభ్యురాలు జెనిఫర్ రాజ్‌కుమార్ చాలాకాలంగా డిమాండ్ చేస్తున్నారు. రెండు దశాబ్దాల తన పోరాటం తర్వాత ఈ విషయంలో విజయం సాధించినందుకు ఆనందంగా ఉందని ఆమె పేర్కొన్నారు. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా భారతీయులు దీపావళి పండుగను ఘనంగా జరుపుకుంటారు. విదేశాల్లో ఉన్న తెలుగువాళ్లు సైతం ఈ పండుగను ఏటా ఎంతో సందడిగా జరుపుకుంటుంటారు.

# ఇక ఐక్యతా రాగమేనా

(మొదటి పేజీ తరువాయి)

ఉన్న వాళ్లంతా ఐక్యంగా ఉంటున్నట్టు కనిపిస్తున్నారు. ఒకరితో ఒకరు సమావేశమై నిర్ణయాలు తీసుకుంటు న్నారు. ఈ స్పీడ్‌ను మరింత పెంచేందుకు వ్యూహాలకు పదును పెట్టేందుకు సుమారు 40 మందికిపైగా తెలంగాణ కాంగ్రెస్ సీనియర్ నేతలు ఢిల్లీకి పయనమయ్యారు. కాంగ్రెస్ అంటే అంతర్గత ప్రజాస్వామ్యం చాలా ఎక్కువ అని ఆ పార్టీ నేతలే సెటైర్లు వేస్తుంటారు. ఆ పార్టీకి బయట శత్రువులతో కంటే లోపల ఉన్న ప్రత్యర్థులతోనే ప్రమాదం ఎక్కువని కూడా చెబుతుంటారు. దానికి కరెక్ట్ ఎగ్జాంపుల్‌గా తెలంగాణ కాంగ్రెస్ ఇన్నాళ్లూ ఉండేది. అయితే కర్ణాటక ఎన్నికల ఫలితాలు చూసిన నేతల మైండ్ సెట్ మారినట్టు కనిపిస్తోంది. అధినాయకత్వం కూడా వారిని ట్యూన్ చేసినట్టు తెలుస్తోంది. అందుకే నేతలంతా ఇప్పుడు ఐక్యరాగం వినిపిస్తున్నారు. ఎప్పుడూ ఢీ అంటే ఢీ అనుకునే రేవంత్‌రెడ్డి, కోమటి రెడ్డి కలిసిపోయి మీటింగ్స్ పెడుతున్నారు. మొన్నటికి మొన్న జూపల్లి, పొంగులేటిని పార్టీలోకి ఆహ్వానించడానికి వీళ్లద్దరూ కలిసి వెళ్లారు. అదే టైంలో రేవంత్ రెడ్డి కూడా కీలక వ్యాఖ్యలు చేశారు. పార్టీలో సీనియర్లుగా ఉంటున్న వారి సలహా మేరకే చేరికలు, ఇతర కార్యక్రమాలు ఉంటాయని ప్రకటించేశారు. దీంతో పార్టీలో కొత్త జోష్ కనిపిస్తోంది. తెలంగాణ కాంగ్రెస్‌లో పాజిటివ్ వైబ్ కనిపిస్తున్న వేళ దాన్ని మరింతగా ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ప్రయత్నాలు మొదలు పెట్టింది అధినాయకత్వం. అందుకే కీలమైన నేతలను ఢిల్లీకి పిలిచింది. వీళ్లంతా రాహుల్ గాంధీతో సమావేశం కానున్నారు. ఈ సమావేశంలో రెగ్యులర్‌గా రాష్ట్రంలో బహిరంగ సభలు పెట్టే అంశంపై చర్చిస్తారు. అదే టైంలో కొత్తగా చేరుతున్న వారిపై కూడా దృష్టి పెట్టబోతున్నారు. ఎవరెవర్ని చేర్చుకోబోతున్నారు. వారికి ఎలాంటి హామీ ఇవ్వాలనే అంశాలపై చర్చిస్తారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో బాధితులుగా ఉన్న వర్గాలతో మీటింగ్స్ పెట్టి వారికి భరోసా ఇవ్వడం, వారి ఓట్లు గంపగుత్తగా కాంగ్రెస్‌కు పడేలా చేయడంతోపాటు రాహుల్, ప్రియాంకతో భారీ బహిరంగ సభలను పెట్టేలా ప్లాన్ చేస్తున్నారని సమాచారం. వీటిపై ఈ సమావేశం అనంతరం క్లారిటీ వస్తుందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. బీఆర్ఎస్, బీజేపీలో ఉండలేక ఊగిసలాడుతున్న వారికి కూడా భవిష్యత్‌పై భరోసా ఇచ్చి వారిని పార్టీలోకి అహ్వానించడం కూడా చేయబోతున్నారని టాక్. మరోవైపు షర్మిల విషయంపై కూడా చర్చించే ఛాన్స్ ఉందని సమాచారం. షర్మిల కాంగ్రెస్‌లో విలీనం చేస్తారనే ప్రచారం జోరుగా సాగుతోంది. దీన్ని షర్మిల ఖండిస్తున్నప్పటికీ ప్రచారం మాత్రం ఆగడం లేదు. దీనిపై కూడా అధినాయకత్వం నేతలతో మాట్లాడే అవకాశం ఉందని తెలుస్తోంది.

# ఎన్నికల వ్యూహం ప్రారంభించాం

(మొదటి పేజీ తరువాయి)

పేర్కొన్నారు. కర్ణాటకలో ఏ ఫార్ములాతో ఎలా అధికారం ఏర్పాటు చేశామో.. అలాంటి మౌలిక సూత్రాలు తెలంగాణలో ఫాలో అవుతామని రేవంత్ రెడ్డి వెల్లడించారు. తెలంగాణ ఎన్నికల సన్నాహాలు ప్రారంభమ య్యాయని ఆయన అన్నారు. తెలంగాణలో ఎన్నికల కార్యాచరణను కాంగ్రెస్ పార్టీ ప్రారంభిం చింది. పార్టీ సీనియర్ నేతలకు కొన్ని సూచనలు చేశారు. కర్నాటకలో అవలంభించిన వ్యూహాలనే ఇక్కడ అమలు చేసి విజయం సాధిస్తామన్నారు. మీడియా సమావేశంలో ఆ పార్టీ సీనియర్ నేతలు మాట్లాడారు. తెలంగాణ ప్రజలు కాంగ్రెస్ వైపు ఉన్నారని ఆ పార్టీ వ్యవహారాల ఇంచార్జి మాణిక్ రావు ఠాక్రే తెలిపారు. బీజేపీ, బీఆర్ఎస్ మధ్య లోపాయకారి ఒప్పందం ఉందన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ కలిసి కాంగ్రెస్ పార్టీని దెబ్బ తీసేందుకు చూస్తు న్నాయని అన్నారు. తెలంగాణ ప్రజలు డబ్బు వృథా అవుతోందన్నారు. ప్రజల సొమ్మంతా ఒక పార్టీ ప్రచార ఖర్చులకే పోతోందన్నారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంలో ప్రజలు ఆశించిన మార్పురాలేదన్నారు. తెలంగాణను కేసీఆర్ కుటుంబం లూటీ చేస్తోంద న్నారు. గడపగడపకు కేసీఆర్ కుటుంబ దోపిడీని ప్రజలకు వివరిస్తామని తెలిపారు తెలంగాణ అభివృద్ధి కోసం కాంగ్రెస్ పార్టీ ఏం చేయానుందో త్వరలోనే చెప్తామన్నారు. కేసీఆర్ అవినీతిని ప్రజల్లోకి తీసుకెళ్లే కార్యాచరణపై ఈ రోజు సమావేశంలో చర్చించించినట్లుగా మీడియాకు తెలిపారు.

కేసీఆర్ అవినీతిని ప్రజల్లోకి తీసుకెళ్లే కార్యా చరణపై చర్చించాం. నేతల అభిప్రాయాలను అధిష్ఠానం స్వీకరించి, మాకు కొన్?న సూచనలు చేసిందన్నారు. భేటీకి రేవంత్ రెడ్డి జానారెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి, షబ్బీర్ అలీ, సంపత్‌తోపాటు పలువురు సీనియర్ నేతలు హాజరయ్యారు. బూత్ స్థాయి నుంచి పార్టీ బలోపేతంపై చర్చించామని చెప్పారు. రాబోయే ఎన్నికల్లో వ్యూహాత్మకంగా వ్యవహరించి ఎలా విజయం సాధించాలనే విషయంపై చర్చించామని పేర్కొన్నారు రేవంత్ రెడ్డి.

## నీటి సమస్యలు తీర్చడంలో అధికారులు, నాయకులు విఫలం

### గ్రామాల్లో నెలకొన్న నీటి సమస్యలు



కౌతాళం – ప్రభాత సూర్యుడు : నీటి సమస్యలు తీర్చడంలో అధికారులు నాయకులు విఫలమయ్యారని ఎరిగేరి గ్రామంలో నీటి సమస్య కోసం రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. గ్రామంలో నీటి సమస్యలపై అధికారులకు ఎన్నోసార్లు విన్నవించుకున్న నాయకులకు చెప్పుకున్న ఇంతవరకు పట్టించు కోవడంలేదని నేటి సమస్యతో ఎన్నో సమస్యలు ఎదుర్కొ ంటున్నామని గ్రామస్తులు తెలిపారు. నీళు మూడు రోజులకు లేదా నాలుగు ఐదు రోజులకు రాకపోయే ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని అయినా అధికారులు పట్టించు కోవడంలో విఫలమయ్యారని వాపోయారు వెంటనే అధికారులు స్పందించి నేటి సమస్యపై పరిష్కారం చేయాలని లేని పక్షంలో ఒక రోజు వరకు నిరసన వ్యక్తం చేస్తామని హెచ్చరించారు. గ్రామాల్లోనే కాదు కౌతాళం, రౌడుర్, తోవి, తదితర గ్రామాల్లో నీటి సమస్యలు ఉన్నాయని వెంటనే నాయకులు స్పందించి నీటి సమస్యలు పరిష్కరించాలని కోరారు.

## ఘోర రోడ్డు ప్రమాదం

### నలుగురు స్పాట్ డెడ్ - ఇద్దరి పరిస్థితి విషయం

### మేడారం తల్లుల దర్శనానికి వెళ్లి వస్తుండగా ఘటన



హన్మకొండ – ప్రభాత సూర్యుడు : హన్మకొండ జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఆత్మకూరు, కటాక్షపూర్ ప్రధాన రహదారిపై జరిగిన ఘటనలో కారులో ప్రయాణిస్తున్న నలుగురు అక్కడికక్కడే మృతిచెందారు. కారు డ్రైవర్ తో పాటు మరొకరికి తీవ్ర గాయాల య్యాయయి. అందులో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. వీరంతా కారులో మేడారం సమ్మక్క సారలమ్మ దర్శనానికి వెళ్లి తిరిగి వస్తున్న క్రమంలో ఈ ఘటన జరిగింది. టిప్పర్ బలంగా ఢీకొట్టడంతో కారు నుజ్జునుజ్జు కాగా, తీవ్ర గాయాలపాలైన వారు కారులోనే ప్రాణాలు విడిచినట్లు స్తానికులు చెబుతున్నారు. చనిపోయిన వారిలో ఇద్దరు పురుషులు, ఇద్దరు మహిళలు ఉన్నారు. గ్రేటర్ వరంగల్ పరిధిలోని కాశీబుగ్గ వాసులు. మృతిచెందిన వారిలో అనుముల నరసింహ చారి, వెల్దండి సాంబరాజు, వెల్దెండి ఆకాంక్ష, వెల్దండి లక్ష్మి ప్రసన్న ఉన్నారు. తీవ్రంగా గాయపడిన వారు ఎంజీఎం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.

## తుల్జా భవానీ రెడ్డిపై కేసు నమోదు

సిద్దిపేట – ప్రభాత సూర్యుడు : జనగామ ఎమ్మెల్యే యాదగిరిరెడ్డి కూతురు తుల్జా భవానీరెడ్డిపై కేసు నమోదు అయింది. రెండు రోజుల క్రితం మత్తడి ఆవరణ స్థలంలో 1270 గజాల స్థలం చుట్టు ఉన్న ఫెన్సింగ్‌ను తుల్జాభవాని రెడ్డి కూల్చివేసిన విషయం తెలిసిందే. తన పేరుపై ఉన్న ఆ స్థలాన్ని మున్సిపాలిటికి అప్పగిస్తున్నట్లు తుల్జాభవాని చెప్పారు. పక్కనే ఉన్న తన భూమి ఫెన్సింగ్‌ని కూడా తుల్జాభవాని కూల్చివేసిందని చేర్యాల పోలీసులకు బాధిత స్థల యజమాని రాజు భాయ్ ఫిర్యాదు చేసాడు. తుల్జాభావాని రెడ్డితో పాటు మరికొందరిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఎమ్మెల్యే ముత్తిరెడ్డే ఈ కేసు పెట్టించారని ఆరోపణలు వెల్లువెత్తాయి.

## నోట్ల మార్పిడి మోసం.. - ఇద్దరు అరెస్టు

పార్వతీపురం – ప్రభాత సూర్యుడు : నోట్ల మార్పిడి చేస్తామని జిల్లా కేంద్రంలో 90 లక్షల నగదుతో పరారైన ఘనులు ఇద్దరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ కేసుకు సంబంధించి కాకినాడ, భీమవరం చెందిన చక్రపాణి, నజిమ్ మరో ఇద్దరు తొంభై లక్షలకు ఐదు వందల నోట్లు ఇస్తే కోటి రూపాయల రెండు వేల రూపాయల నోట్లు ఇస్తామని ఎర వేసారు. ఆఫర్ కు ఆశపడ్డ రేగిడి ఆమదాలవలస చెందిన బాధితులు ఎ.అనిల్, వి.అనిల్‌లు, తొంభై లక్షల రూపాయలు తీసుకొచ్చి ఇచ్చారు. కోటి రూపాయలు రెండు వేల నోట్లు వేరే చోట ఉన్నాయని నమ్మించి తొంభై లక్షలతో నిందితులు పరార్ అయ్యారు. బాధితులు ఆశ పడి తమ స్నేహితుల వద్ద అప్పులు తెచ్చి తొంభై లక్షలకు ఐదు వందల నోట్లు ఏర్పాటు చేసారు. మోసపోయామని తెలిసి బాధితులు పోలీసులకు పిర్యాదు చేసారు. పోలీ సులు కేసు నమోదు దర్యాప్తు ప్రారంభించారు. నలుగురి లో ఇద్దరు దొరికారు. మరో ఇద్దరు పరారీలో వున్నారు.

### అసంపూర్తిగా ఉన్న కుడికాలువ పనులను

# పరిశీలించిన కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ డా మేడిపల్లి

చొప్పదండి – ప్రభాత సూర్యుడు : కరీంనగర్ జిల్లా గంగాధర మండలం మధుర నగర్ గ్రామంలో అసంపూర్తిగా ఉన్న నారాయణపూర్ రిజర్వాయర్ కుడి కాలువ పనులను టిపిసిసి అధికార ప్రతినిధి చొప్పదండి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ డా మేడిపల్లి సత్యం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2008లో ఆనాటి కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పల్లె బాట కార్యక్రమంలో భాగంగా దివంగత ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి చొప్పదండి నియోజకవర్గం లో ఎల్లంపల్లి ప్రాజెక్టులో భాగంగా ఎడమ, కుడి కాలువ నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారని అన్నారు.ఎల్లంపల్లి ఎడమ కుడి కాలువ పనులు 90% కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలోనే పూర్తయినాయి. కేవలం 10% పనులను పూర్తి చేయకుండా స్థానిక ఎమ్మెల్యే నిర్లక్ష్యం చేస్తున్నాడని తెలిపారు..ఎమ్మెల్యే సుంకే రవిశంకర్ కు కమిషన్ల పై ఉన్న శ్రద్ధ, కుడి, ఎడమ కాలువల పనుల పూర్తిపై లేదని అన్నారు.అదనపు టీఎంసీ కోసం వేల కోట్ల రూపాయలను ఖర్చు చేస్తున్న ప్రభుత్వం, కుడి ఎడమ కాలువ పనుల పూర్తి కోసం నిధులు ఇవ్వకపోవడం సోచనీయమని అన్నారు. చొప్పదండి నియోజకవర్గాన్ని కోనసీమగా మార్చుతానని ప్రగల్బాలు పలుకుతున్న ఎమ్మెల్యే సుంకే రవిశంకర్, గంగాధర మండలంలోని ఎగువ గ్రామాలు, బోయినపల్లి మండలంలోని గ్రామాలు ఎడారిగా ఎందుకు మారుతున్నాయో తెలపాలని కోరారు..వెంటనే నారాయణపూర్ ఎడమ గుడి కాలువల క్రింద భూములు కోల్పోతున్న



రైతులకు నష్టపరిహారం చెల్లించి, పనులను వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు.అలాగే నారాయణపూర్ రిజర్వాయర్ కట్ట మరమ్మత్తు కోసం, గంగాధర ఎల్లమ్మ చెరువు కట్ట గండి పూర్చడం కోసం వెంటనే నిధులు విడుదల చేయాలని అన్నారు. నారాయణపూర్ కుడి ఎడమ కాలువ పనులను పూర్తి చేయకుంటే గంగాధర, బోయినపల్లి మండలాల రైతులతో కలిసి ఉద్యమం చేస్తామని హెచ్చరిస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గంగాధర , బోయినిపల్లి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు పురుమల్ల మనోహర్, వన్నెల రమణారెడ్డి,బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు దుబ్బాసి బుచ్చయ్య, జిల్లా కార్యదర్శి రామిడి రాజిరెడ్డి, మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు కొలిపాక స్వామి , మండల కిసాన్ సెల్ అధ్యక్షులు బూర్గు గంగన్న, వీరేశం,సుద్దాల రాజశేఖర్ రెడ్డి,జాగిరపు శ్రీనివాస్ రెడ్డి, తోట కరుణాకర్, దోర్నాల శ్రీనివాస్ రెడ్డి, చిప్ప చక్రపాణి, రాచమల్ల భాస్కర్,కరీం, పెద్దోల రాజేశం, ముచ్చె శంకరయ్య, పుల్కం నరసయ్య, మల్లేశం,దోమకొండ మహేష్, రమేష్ ,కొల ప్రభాకర్, వినోద్ రెడ్డి, నాగేందర్ రెడ్డి, అంజిరెడ్డి,పోచమల్లు , మహేష్,సాగర్,తదితరులు పాల్గొన్నారు.

# యువత ఉజ్వల భవిష్యత్తుకు నాంది పలకాలి

### ఎస్సై నరేంద్ర కుమార్ రెడ్డి




కౌతాళం – ప్రభాత సూర్యుడు :మత్తు పదార్ధాలకు దూరంగా ఉంటు యువత మంచి భవిష్యత్తును ఏర్పాటు చేసుకోవాలని ఎస్సై నరేంద్ర కుమార్ రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం ను జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు కౌతాళం గ్రామంలో విస్తృతంగా అవగాహన సదస్సులు,,ర్యాలీలు నిర్వహించారు. అనంతరం ఎస్సై మాట్లాడుతూ అంతర్జాతీయ మత్తు పదార్థాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా స్థానిక జిల్లా ఉన్నత పాఠశాల, ప్రతిభ హై స్కూల్ పాఠశాల విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.డ్రగ్స్కు అలవాటు పడిన యువత బంగారు భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారనియువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని యువత మరియు ప్రజలలో కూడా ఈ మత్తు పదార్థాల (గంజాయి , గుట్కా, ఖైనీ, నల్ల మందు, బ్రౌన్ షుగర్, హెరాయిన్) వల్ల జరుగు నష్టాల గురించి,ప్రతి కళాశాల యాజమాన్యం, బోధకులు మరియు విద్యార్థులలో “బాధ్యత” మరియు “జవాబుదారీతనం” తీసుకురావాలని గంజాయి, ఇతర మత్తు పదార్థాల వలన వచ్చే ఆరోగ్య సమస్యల పై ప్రజలలో మరియు యువత లో పూర్తి అవగాహన కల్పించారు. మాదక ద్రవ్యాలు విక్రయించి సొమ్ము చేసుకుందామని ఎవరైనా అమాయక ప్రజలు , యువకులు, విద్యార్థుల జీవితాలను ప్రక్క దోవ పట్టించాలని చూస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఎవరైనా గంజాయి, మాదకద్రవ్యాలు ఉన్నట్లు ఖచ్చితమైన సమాచారం తెలిస్తే వెంటనే స్థానిక పోలీసులకు లేదా టోల్ ఫ్రీ నెంబర్ 14500 నెంబర్ కు కాల్ చేసి సమాచారం ఇచ్చినా వారి వివరాలు గోప్యంగా ఉంచడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది మరియు టీచర్లు మహిళా పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# కౌశిక్ రెడ్డిని భర్తరఫ్ చేయాలి : ఈటల జమున

మేడ్చల్ – ప్రభాత సూర్యుడు : తెలంగాణ ప్రజలు అనుకుంటే ఏ పార్టీతో అయినా కెసిఆర్ ను ఓడించడం సాధ్యమే.ఈటల రాజేందర్ ఏ పార్టీలో ఉన్నా సంతృప్తిగా ఉన్నారు. ఆయన ప్రజలకోసం పనిచేస్తారని ఈటల భార్య ఈటల జమునల అన్నారు. మంగళవారం నాడు ఆమె మీడియాతో మాట్లాడారు. మేం ఎప్పుడు పదవుల కోసం ప్రాకులాడ లేదు. కాళ్ళు మొక్కుడు మా రక్తంలో లేదు. నేను ప్రత్యక్ష రాజకీయాల్లోకి రాను. పరోక్షంగా ఉండి.. ఈటల రాజేందర్‌కు అండగా ఉంటా. ఈటల రాజేందర్.. ప్రతిష్ఠ దిగజారింది, మెప్పు కోసం మాట్లాడబోతున్నారు అని వాట్స్ అప్ లో డుతున్నారు. కానీ ఈటల ప్రతిష్ఠ ఎప్పుడు దిగజారదు. ఈటల ఉద్యమ కారుడు. ప్రజలు మమ్మల్ని కాపాడుకుంటారు. లంగ, దొంగ పనులు చెయ్యలేదు. చిల్లర గాల్లు ఎన్నికల సమయంలో ఈటల కాళ్ళకు కట్టు కట్టుకుంటారు. జమున కొంగు పట్టుకొని అడుగుతారు అన్నారు. మేము అలాంటి పనులు చేసే వాళ్లం కాదు. టజల్లో ఉన్నాం ప్రజల మెప్పు పొందాము. చిల్లర, పిచ్చి కుక్కను ఎమ్మెల్సీని చేసి హుజూరాబాద్ మీదకు కెసిఆర్ వదిలిపెట్టారు. మహిళలను కించ పరుస్తారు. అమ్మ నాన్న సంస్కారం నేర్పారు అన్నారు. మరి కెసిఆర్ ఈ పిచ్చి మాటలు నేర్పించారా ? ఎన్ని మాట్లాడితే అన్ని ఎక్కువ పదవులు వస్తున్నాయా ? గోల్డ్ మెడల్స్ ఇస్తున్నారా? 2014 లో కట్టిన అమరవీరుల స్థూపంను ఆయన పేరు లేదు అని కూల్చి వేశారు.. అమరవీరుల స్తూపం తాకే అర్హత లేదు. తెలంగాణ ప్రజలందరూ గమనిస్తూనే ఉన్నారు. మా మీద అక్కస్సుతో ఇదంతా కెసిఆర్ చేయిస్తున్నారు. కౌశిక్ రెడ్డికి ఎమ్మెల్సీగా గా ఉండే నైతికత లేదు. కెసిఆర్ ఆయన్ను వెంటనే భర్తరఫ్ చెయ్యాలి. గవర్నర్‌ను తిడితే మందలించల్సింది పోయి పదవులు ఇచ్చారు. చెల్పూర్ సర్పంచ్ మహేందర్ గౌడ్‌ను అక్రమ కేసు పెట్టి అరెస్ట్ చేసి.. పోలీసులతో కొట్టించారు.. దాన్ని వీడియో కాల్ చేసి మరి చూయించాలని ని ఒత్తిడి చేసిన రాక్షసుడు. మహిళా ఉద్యోగుల పట్ల అసభ్యంగా ప్రవర్తించారు. పంచా యితీ సెక్రటరీనీ యూజ్ లెస్ ఫెల్లో అని తిట్టారు. రైతును సిగ్గు లేదా అని తిట్టారు. రైస్ మిల్లులు దగ్గర డబ్బులు వసూలు చేస్తున్నారు . 20 కోట్లు పెట్టి ఈటల రాజేందర్ ను చంపేస్తా అని కౌశిక్ రెడ్డి చెప్తున్నారు అంటే అది కెసిఆర్ అండతోనే. నీతో చంపించడానికేన మేము ఉద్యమం చేసింది. చెప్పకుంటే వినకపోతే చంపడానికి కూడా కెసిఆర్ రెఢీ అవుతున్నారని అను కోవాలా ? ఆర్థికంగా అనేక ఇబ్బందులు పెడుతున్నారు. మా మొత్తం దుర్మార్గులను ఎదురిస్తున్న అన్నందుకు సంతో షంగా ఉన్నాం. చిన్న కులాల వారు అనా చిన్న చూపు.. ఎవరి మాట్లాడిన మహిళలు క్షమించరు చెప్పుల దండ వేస్తారు. ఊర్లో తిరగనివ్వరు. శాడిస్ట్ లకు పోలీసులు మద్దతు ఇవ్వకండి. పిచ్చికుక్క అని హుజూరాబాద్ ప్రజలు అందరు అనుకుంటున్నారు. తిట్టి కొట్టి ఇప్పుడు మళ్లీ ఫేక్ అంటున్నారు. క్షమాపణ చెప్పమని అంటే చెప్పకపోతే ఎలా ? ప్రజలారా కళ్ళు తెరవండి. ఇలాంటి ముఖ్యమంత్రి ఉంటే మనకు రక్షణ ఉండదు. ఈ దుర్మార్గ ప్రభుత్వాన్ని మహిళలందరం కలిసి ఇంటికి పంపిద్దాం. కెసిఆర్ మా ఇంట్లో.. నా భర్త, పిల్లలు ఎవరు రక్తం బొట్టు పడినా మీదే బాధ్యత. అనిఅమె ఆన్నారు.



Printed, Published and Owned by CHERUKU UPENDAR, Printed at Akshaya Printers, H/No: 7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR, ABDULLA-PURMET MANDAL, HAYATH NAGAR, PIN:501505, RANGAREDDY DISTRICT/ HYDERBAD CITY, TELANAGANA, EDITOR CHERUKU UPENDAR, PUBLICATION at HAMSA PUBLICATIONS, H/No: 7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR, ABDULLAPURMET MANDAL, HAYATH NAGAR, PIN:501505, RANGAREDDY DISTRICT/ HYDERBAD CITY, TELANAGANA, E-mail: upendrabbk@gmail.com